# అనుబంధం

"కృష్ణమూర్తీ నేను చచ్చినా నమ్మను ఒక చిన్న తాడుతో ఒక రాక్షసుడ్ని మనిషిని చేయొచ్చా. జోకులేస్తున్నావా? రామాయణంనాటి కథని తిరగ రాస్తున్నావా?"

"నిజం చెప్తున్నానయ్యా ఒక్కో మనిషి ఒక్కొక్కళ్ల మాటకి కట్టుబడుంటాడు. ఒట్టేస్తే తీసి గట్టున పెట్టెయ్యని మాట మీద నిలబడే వాళ్ళుంటారు. ప్రతీవాళ్ళ మాటా అందరూ పాటిస్తారని కాదు. సోమరాజు గుప్తా మాత్రం చిన్న తాడుకి కట్టుబడిపోయాడు. కథ చెప్తాను వింటావా?"

"నువ్వేం చెప్పినా వింటాను కానీ నమ్మను"

"వింటానన్నావ్ సంతోషం. నమ్మకపోవటం నీ ఇష్టం"

✦ ✦ ✦

గుప్తా తాతల్నాటి నుంచి సాగుతున్న కిరాణా దుకాణానికి నాలుగోతరం ఓనరు. ఈ వంశాంకురం అప్పటి రక్తాన్ని, పిసినారి తత్వాన్ని, వంశపారంపర్యంగా అందిపుచ్చుకున్నవాడే. ఎవరైనా అరువిమ్మంటే "అరువివ్వను కావాలంటే ఋణమిస్తాను. వడ్డీ ఇచ్చి సరుకులు తీసుకో" అంటూ వ్యాపారాన్ని నాలుగు తరాలకన్నా మించిన సంపత్తికి పెంచాడు. మరో నాలుగు తరాలు ఏ ప్రాబ్లమ్ లేకుండా బతగ్గల ఆస్తి సంపాదించాడు. దానం, ధర్మం, జాలి, దయ, ప్రేమ, అభిమానం ఇలాంటి సెంటిమెంట్ల

జోలికి సోమరాజు గుప్తా ఎప్పుడూ వెళ్లలేదు.

చాలాసార్లు భార్య సుగుణవతి భర్త ప్రవర్తనమీద బాధను వ్యక్తం చేస్తూనే ఉండేది. ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ఐశ్వర్యలక్ష్మి తప్ప మిగిలిన లక్ష్ములతో ప్రమేయం లేకుండా బతుగ్గడిపేయడం తనకేమాత్రం నచ్చట్లేదని కనీసం సంతానలక్ష్మి కోసమైనా దానధర్మాలు చెయ్యమని మొగుణ్ణి సతాయిస్తుండేది. కానీ సుగుణవతి కోరిక మన సోమరాజు పట్టించుకోడు. వాళ్ళ కుటుంబంలో తరతరాలుగా ఒకే కొడుకు పుడుతున్నాడు. ఆస్తంతా ముక్కలు కాకుండా కాపాడుకుంటూవస్తున్నాడు.

బిడ్డల్లేరని భార్య బెంగపడుతుంటే 'పూజలు వ్రతాలు చేస్తానంటే', 'పోన్లెద్దూ అదో ఖర్చు' అనే గొప్ప పొదుపరి సోమరాజు గుప్తా.

'ఈ ఆస్తంతా కట్టుకుపోతామా, మనం పట్టుకుపోతామా' అని సుగుణవతికి మనసులో చాలా బెంగగానే ఉండేది. అలాంటి సోమరాజు గుప్తా మారిపోవడమే ఈ కథకి ప్రధానాంశం.

ఓరోజు శ్రావణ పూర్ణిమనాడు ముద్దులు మూటగడుతున్న ఓ చిన్నపాప రూపాయి కోయిన్తో వచ్చి "రాఖీ కావాలి" అంది.

"రాఖీ రూపాయికి రాదు" అన్నాడు సోమరాజు.

"ఎన్ని రూపాయలవుతుంది" బేలగా అడిగింది.

"మూడు రూపాయలు తెచ్చుకో- మూడు నుండి ముప్పయి రూపాయల వరకు మా కొట్లో రాఖీలున్నాయి"

పాప కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి "రూపాయివి లేవా?" గద్గదంగా అడిగింది.

"లేవు" గయ్యిమంటూ చెప్పాడు గుప్తా.

ఇంటికొచ్చింది.

'రూపాయికన్నా ఎక్కువ డబ్బులు ఇవ్వలేనని' సవితని తల్లి తిట్టింది.

రిక్షా అన్నయ్యకి రాఖీ కట్టాలని బ్రతిమాలింది.

అమ్మ చూడకుండా, ఇంట్లోని జొన్నగింజలు తీసుకుని, మళ్లీ కొట్టుకొచ్చింది.

"ఈ జొన్న గింజలు తీసుకుని రాఖీ ఇస్తావా?" అని అడిగింది.

"ఇవెక్కడివి?" అని సోమరాజు గుప్తా అడిగాడు.

"నువ్వు మా అమ్మకు చెప్పకేం! ఇవి మీ కొట్లో కొన్నవే! నాకో రాఖీ తప్పకుండా కావాలి. కానీ ఇంట్లో డబ్బులు లేవు"

జొన్నలు తీసుకున్నాడు సోమరాజు గుప్తా.

ఆ అమ్మాయికి మూడు రూపాయల రాఖీ ఇచ్చాడు.

ఆ అమ్మాయికి రాఖీ ఇస్తున్నప్పుడు చూసి- సోమరాజు భార్య సుగుణవతి కళ్ళనీళ్లు పెట్టుకుంది.

ఆవిడ కంట్లో నీళ్ళు చూడగానే సోమరాజులో కదలిక వచ్చింది.

తనమ్మిన జొన్నలు తానే కొనుక్కుని ఒక చిన్న పిల్లకి రాఖీ అమ్మడం తనకే బాధనిపించింది.

అన్నయ్యకి రాఖీ కట్టాలన్న చెల్లెలి తపన ఆ క్షణంలో అతని మనస్సును మార్చి వేసింది.

తీసుకున్న జొన్న గింజలు తిరిగి ఇచ్చేసి-

"రాఖీ ఎవరికి కడతావ్?" అన్నాడు.

"మా ఇంటి పక్క రిక్షా అన్నయ్యకి" అంది సవిత.

సోమరాజు కళ్ళల్లో ఆశ్చర్యం.

"ఇటు రా!" అని పిలిచాడు.

"రిక్షా అన్నయ్యా...!" అడిగాడు.

"అవును. ఆ అన్నయ్య మమ్మల్ని ఫ్రీగా స్కూలుకి తీసుకెళ్తాడు. ఆ అన్నయ్య మాకు వాళ్ల పెరట్లో కాసిన జాంకాయలు, సపోటాలు తెచ్చిస్తాడు. తనకి రాఖీ కట్టాలని నాకు అప్పుడే అన్పించింది. అమ్మ దగ్గరేమో డబ్బుల్లేవు" అంది.

"ఇంకో రాఖీ ఇస్తాను నాకు కడతావా?" అన్నాడు.

ఆ అమ్మాయి "థేంక్యూ అన్నా!" అంటూ రాఖీ అతనికి కట్టింది.

ఇరవై యేళ్ళు ఈ బంధం కొనసాగి అనుబంధమైంది.

సవిత రాఖీ కట్టిన చెల్లాయో? కడుపున పుట్టిన కూతురో.. ఆ అమ్మాయికి చదువు చెప్పించి మంచి సంబంధం చూసి, కాళ్ళు కడిగి కన్యాదానం చేసి, రాఖీ కట్టిన ఋణం తీర్చుకున్నాడు.

రూపాయి విలువ చేసే ఒక చిన్నతాడు వాళ్ళింట్లో అందరికీ బంధువు న్జేసింది.

✦ ✦ ✦

"నేను ప్రత్యక్షసాక్షిని, సవిత, గుప్తా శవాన్ని శ్మశానానికి తీసుకెళ్ళి 'కొరివి నేనే పెడతానంది'. అందరం గుండెలు బాదుకున్నాం, ఆడపిల్లకి కొరివిపెట్టే అర్హత లేదన్నాం, కానీ సుగుణవతి సవితే కొరివిపెట్టాలని వాదించి గెలిచింది.

ఒక్క చేతి తాడు ఎంత బంధాన్ని ఏర్పాటు చేసిందో...

"ఇది అన్నా చెల్లెళ్ళ బంధం కాదు. తండ్రీకూతుళ్ళ అనుబంధం" అంటూ కళ్ళు తుడుచుకున్నాడు కృష్ణమూర్తి.

కథ విన్న స్నేహితుడికి ఇన్నేళ్ళయ్యాక్కూడా సవితని పరామర్శిద్దామని అనిపించింది.